క్లుప్తంగా

కార్మికులకు మేడే సెలవు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: అన్ని రంగాల కార్మికులకు మేడే రోజున సెలవు అమలు చేయాలని టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కె సుధాకర్ మాట్లాడుతూ.. కార్మికులు సంఘటితం కాకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికలోకం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, రాజేశ్వర్, సాయన్న, ఇంతియాజ్, ధర్మపురి, కిషన్, గంగన్న, లక్ష్మీనారాయణ, నర్సింగరావు, గంగాధర్ పాల్గొన్నారు.

బయోటెక్నాలజీ విద్యార్థులకు అభినందన



విద్యార్థి ప్రత్యూషను అభినందిస్తున్న వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రత్యూష, పవన్ ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ సంస్థ నుంచి సమ్మర్ రీసెర్చ్ ఫెలోషిప్ కు ఎంపిక కావడం అభినందనీయమని వీసీ టి యాదగిరిరావు పేర్కొన్నారు. ప్రత్యూష నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాంట్ రీసెర్చ్ సెంటర్, న్యూఢిల్లీలో పరిశోధనలు చేయనున్నారని, పవన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్‌లో పరిశోధనలు చేస్తారని విభాగాధిపతి ప్రసన్నశీల తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రత్యూషను వీసీ ప్రత్యేకంగా అభినందించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచితంగా యోగా మ్యాట్స్ పంపిణీ




యోగా మ్యాట్స్‌ను అందజేస్తున్న సన్నీకుమార్

సుభాష్‌నగర్: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న దయానంద్ యోగా కేంద్రంలో అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా యోగా మ్యాట్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్షిత ఫౌండేషన్ చైర్మన్, సామాజికవేత్త సన్నీ కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా చాలా ముఖ్యమని అన్నారు. ప్రతిఒక్కరూ సేవాతత్వాన్ని అలవర్చుకోవాలని, పేదలకు సాయం చేయడమే అక్షిత ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో యోగా గురువు రాంచందర్, ఆర్చరీ కోచ్ ఎం మురళీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాలకు గంజ్ ప్రత్యేకం

- 1905లో మార్కెట్ నిర్మాణం
- ప్రస్తుతం కూరగాయల మార్కెట్
- ఐదు ఎకరాల్లో ఏర్పాటు

గుడ్ మా...ర్నింగ్ నిజామాబాద్. ఉదయం లేవగానే మనం గరం.. గరం చాయ్ తాగి టిఫిన్ లాగేస్తాం.. ఇంకాస్తయ్యాక వార్తల కోసం పేపర్ తిరగేస్తుంటాం. అందులో మన జిల్లా వార్తలు.. ప్రాముఖ్యత గల ప్రాంతాలు, దశాబ్దాల చరిత్ర కలిగిన విషయాల కోసం ఆసక్తి చూపుతాం. అలాంటి దశాబ్దాల చరిత్ర గల విషయాలను 'సాక్షి' మీ ముందుంచుతోంది. అందులో భాగంగానే ఇందూరులోని ముఖ్య భాగమైన పాత గంజ్, క్లాక్ టవర్ గురించి ఈ రోజు తెలుసుకుందాం..





ఖలీల్‌వాడి : ఇందూరులోని పాత గంజ్‌లో ఉన్న క్లాక్‌టవర్‌కు దశాబ్దాల చరిత్ర ఉంది. దీనిని సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి తన సంస్థానంలో రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండేందుకు మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. నగరంలోని పాత గంజ్‌లో నాడు రైతులు తమ పంటలను అమ్మకాలు, పంటలకు కావాల్సిన విత్తనాలు, ఇంటికి కావాల్సిన వస్తువులు, బంగారు ఆభరణాలను కొనుగోలు చేసేవారు. ఈ మార్కెట్‌కు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాతోపాటు జగిత్యాల, నిర్మల్ జిల్లా, మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాల నుంచి వచ్చేవారు. నాటి నిజాం పేరుమీదుగా సిర్నాపల్లి దొరసాని మహబూబ్ గంజ్‌గా నామకరణం చేసింది. ప్రస్తుతం గాంధీగంజ్, పాతగంజ్‌గా పిలుస్తున్నారు.

ప్రస్తుతం బంగారు దుకాణాలు..

బంగారు ఆభరణాల షాపులు ప్రస్తుతం ఇక్కడ కొనసాగుతున్నాయి. వివిధ రకాల ఆభరణాలు తయారు చేసి అమ్మకాలు సాగిస్తారు. బంగారుషాపులకు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి కొనుగోలుదారులు వస్తుంటారు. దీంతోపాటు హోల్‌సెల్, రిటైల్ కిరాణషాపులు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు నిత్యావసర వస్తువులను సరఫరా చేస్తారు. గాంధీగంజ్, పాతగంజ్‌లో ఇప్పుడు కూరగాయల మార్కెట్‌గా ఉంది. నగర ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఉన్న కూరగాయలను కొనుగోలు చేస్తారు. ఇక్కడ అన్నిరకాల కూరగాయలు లభిస్తాయి.

చారిత్రక నేపథ్యం..

జిల్లా కేంద్రంలో దశాబ్దాల క్రితం నిర్మించిన క్లాక్‌టవర్ చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తోంది. 1905లో నాటి సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి క్లాక్‌టవర్‌తోపాటు రెండు స్వాగత తోరణాలను నిర్మించింది. దీని కోసం ఐదెకరాల భూమిని విరాళంగా అందించారు. స్వాతంత్ర్యానికి ముందు ఈ గంజ్‌ను మహబూబ్‌గంజ్ అని పిలిచేవారు. ఆతర్వాత దీనిని గాంధీగంజ్‌గా మార్చారు. ఈ క్లాక్‌టవర్‌లోని గంటల ఆధారంగా పనులు కొనసాగేవి అప్పుడు. ఈ క్లాక్ టవర్‌లోనే మార్కెట్ ఆఫీసును ఏర్పాటు చేశారు. ఇందులో అధికారులు విధులు నిర్వహించేవారు. దాని పక్కనే దుర్గామాత ఆలయం ఉంది. ఇందులో ప్రతి రోజు పూజలు నిర్వహిస్తారు. వ్యాపారానికి ఈ గంజ్ ప్రత్యేక ఉంది. వివిధ ప్రాంతాల నుంచి రైతులు ఇక్కడికి పంటలను తీసుకొచ్చి అమ్మేవారు. అన్ని రకాల షాపులు, వ్యాపారాలు అప్పట్లో ఇక్కడే ఉండేవి. ఇక్కడికి ఎడ్లబండ్లు, గుర్రపు డెక్కీలపై వచ్చి వస్తువులను కొనుగోలు చేసేవారు. మహారాష్ట్ర, ఆదిలాబాద్, కర్ణాటక ప్రాంతం నుంచి గంజ్‌లో పంటలు, వస్తువులు కొనుగోలు చేసేవారు.

అమ్మనాన్నలతో వచ్చేవాడిని..



పాత గంజ్‌లోకి అమ్మనాన్నలతో వచ్చేవాళ్లం. ఇక్కడ శుభకార్యాలకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసేవారు. రైతులు పంటలు అమ్మేవారు. విత్తనాలు కొనుగోలు చేసేవారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారితో సందడిగా ఉండేది.

– గుండ సంతోష్, నిజామాబాద్

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



కొలిప్యాక్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం జక్రాన్‌పల్లి మండలం జక్రాన్‌పల్లి, కొలిప్యాక్, తొర్లికొండ, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన కొలిప్యాక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. త్వరలోనే అర్హులకు ఫ్యామిలీ డిజిటల్ కార్డులను అందజేస్తామన్నారు. దేశంలోనే పేద ప్రజలకు సన్న బియ్యం అందజేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు. రాజీవ్ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు సబ్సిడీ అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం స్థాపన కోసం తమ విలువైన పట్టా భూములను ఇవ్వబోమని వివిధ గ్రామాల రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, కొలిప్యాక్ సొసైటీ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మద్దుల రమేశ్, ఆర్మూర్ గంగారెడ్డి, నర్సారెడ్డి, చిన్న సాయి రెడ్డి, గడ్డం గంగారెడ్డి, కాటిపల్లి నర్సారెడ్డి, నిట్ శేఖర్, శ్రీనివాస్ గౌడ్, కనక రవి, మాదరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజం కోసం..



మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

మోపాల్: మీనయ్య అమరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నగరశివారులోని బోర్గాం(పి)లో మండల నాయకుడు మీనయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం యుద్ధం ప్రకటించిందని, దీనిని అందరూ ఖండించాలని కోరారు. శ్రామిక నగర్ గుడిసెవాసుల పట్టాల కోసం మీనయ్య పోరాడారని గుర్తుచేశారు. అంతకుముందు మీనయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, నాగభూషణం, యాదన్న, పరుచూరి శ్రీధర్, నీలం సాయిబాబా, చిన్నయ్య, వనమాల సత్యం, రమేశ్, భాస్కర్, భుజేందర్, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి కిరాతకం



నిజామాబాద్‌నాగారం: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు చేసిన దాడులు అత్యంత కిరాతకమైనదని పలు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని పలు చోట్ల మంగళవారం నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో నిజామాబాద్ పేపర్ బాయ్స్–ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో అమరులకు శాంతి కలగాలంటు కొవ్వొత్తులతో నివాళి అర్పించి మౌనం పాటించారు. కార్యక్రమంలో వనమాల సత్యం, రణం రవీందర్ గౌడ్, ఏజెంట్లు, సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నిజామాబాద్ సిటీ: జిల్లాలో పనిచేస్తున్న ఆశాకార్యకర్తలకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదలచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యకర్తలకు ఆదివారం, పండుగలకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గాజుల్‌పేట్‌లో రామరక్ష స్తోత్ర పారాయణం

నిజామాబాద్ రూరల్: నగరంలోని గాజుల్‌పేట్‌లో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు సామూహిక పంచ సూక్త రామరక్ష స్తోత్ర పారాయణాన్ని మంగళవారం పఠించారు. కార్యక్రమంలో ప్రమోద్ వట్టల్ వార్, దత్తు శాస్త్రి, మనోహర శాస్త్రి, న్యాలం శ్రీనివాస్, ప్రమోద్ హర్గే గంగాధర్, చంద్ర శేఖర్ శర్మ, శ్రీధర్, వైర్కగర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మంచిప్పలో ఉచిత వైద్యశిబిరం

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామపంచాయతీ ఆవరణలో శ్రీ గురు రాఘవేంద్ర సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. వేసవిలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, అవసరమైతే తప్ప బయటికి రావొద్దని సూచించారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ ప్రణయ, పి శ్రీనివాస్, శశికళ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సుభాష్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల్లో పని చేస్తున్న పార్ట్ టైం లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘం అధ్యక్షురాలు ప్రసన్న కోరారు. ఈ మేరకు మంగళవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రసన్న మాట్లాడుతూ.. పార్ట్ టైం లెక్చరర్ల డిమాండ్ల సాధనకు ఎనిమిది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 21లో సైతం తమకు కనీస ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధకరమన్నారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. సంఘం ప్రతినిధులు రఘువీర్, గంగాధర్ పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డికి ఘన నివాళి



నిజామాబాద్‌అర్బన్: భారతదేశాన్ని బ్రిటిష్ పాలన నుంచి విముక్తి చేయడంలో ఏబీవీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదని ఏబీవీపీ ఇందూరు విభాగ్ కైరి శశిధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కవిత కాంప్లెక్స్‌లో జగన్మోహన్‌రెడ్డి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటకృష్ణ, దుర్గా దాస్, ప్రేమ్ వాసు, విష్ణు, సాత్విక్, ఈశ్వర్, సన్నీ, అభినవ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ధ్వంసమైన కాజ్‌వేలపై పట్టింపేది?



పడకల్ పెద్దమ్మ వాగులో ధ్వంసమైన కాజ్‌వే



మనోహరాబాద్ శివారులో కూలిపోయిన కాజ్‌వే

- ఇబ్బందుల్లో రైతులు, గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

జక్రాన్‌పల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ధ్వంసమైన కాజ్‌వేలపై అధికారుల స్పందన కరువైంది. దీంతో గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ పెద్దమ్మ వాగుపై ఉన్న కాజ్‌వే, మనోహరాబాద్ వాగుపై ఉన్న కాజ్‌వేలు గతేడాది కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. దీంతో వాగుకు అటువైపు వ్యవసాయ పొలాలు ఉన్న రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల యాసంగి సమయంలో రెండు కిలోమీటర్ల దూరం నుంచి తిరిగి వచ్చి పంటలను సాగు చేసుకున్నారు. కానీ పంటలకు అవసరమైన ఎరువులు చల్లుకోవడానికి మందులను తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రైతులు జొన్న, మొక్కజొన్న పంటలు వేసుకున్నారు. ప్రస్తుతం కోత దశలో ఉన్న పంటల వద్దకు కోత కోయడానికి యంత్రాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురొంటున్నారు. గతేడాది పడకల్ పెద్ద చెరువు తెగిపోవడంతో కింది భాగంలో ఉన్న పడకల్ పెద్దమ్మ వాగుపై ఉన్న కాజ్‌వే, మనోహరాబాద్ వాగుపై ఉన్న కాజ్‌వేలు ధ్వంసమయ్యాయి. దీంతో రెండు గ్రామాల రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇదే వాగుపై దగ్గరలో కొత్తగా బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. దీంతో రైతుల పంట పొలాలకు వెళ్లడానికి రెండు కిలోమీటర్ల దూరం నుంచి తిరిగి రావాల్సి వస్తోంది. దీంతో వ్యయ ప్రయాసలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి వాగుపై కాజ్‌వే నిర్మించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పడకల్ శివారులోని పెద్ద మ్మ వాగుపై ఉన్న కాజ్‌వే ధ్వంసం కావడంతో వాగు దాటడానికి ఇబ్బందులు పడుతున్నాం. వరి పంటకు మందులు చల్లుకుందామంటే బైక్‌పై యూరియా బస్తాలను వేసుకుని వాగు దాటడం కష్టంగా మారింది. అదేవిధంగా వ్యవసాయ యంత్రాలు వాగు దాటి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు.

– లాడే సంజీవ్, రైతు, పడకల్

కొత్తగా కాజ్‌వే నిర్మించాలి



పెద్దమ్మ వాగుపై కాజ్‌వే లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నాం. ఏడు నెలలుగా వాగులో నుంచి దాటాలంటే ఎన్నో ఇబ్బందులను పడుతున్నాం. గతేడాది జూలైలో కాజ్‌వే నిర్మాణానికి అధికారులకు విన్నవించాం. ఇంత వరకు ఎలాంటి స్పందన లేదు. నిధులు మంజూరు చేసి వాగుపై కొత్తగా కాజ్‌వేను నిర్మించి రైతుల ఇబ్బందులు తొలగించాలి.

– నందురెడ్డి, పడకల్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 జింఖానా-11.00,4.40,7.40,10.30
- అర్జున్ సన్నాఫ్ వైజయంతి-1.40
- స్క్రీన్-2 సారంగపాణి జాతకం-10.40, 1.30, 4.30, 7.30, 10.30
- స్క్రీన్-3 చౌర్యపాఠం -11.0
- సూర్యాపేట జంక్షన్ -4.40, 10.20
- అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి -7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 సారంగపాణి జాతకం - 10.40, 1.30, 4.20, 7.10, 10.00
- స్క్రీన్-2 నె జహ-2(3డీ-ఇంగ్లిష్)-10.30, 7.40
- జింఖానా-1.40, 4.40
- తుడరుమ్-10.40
- స్క్రీన్-3 జింఖానా -11.25, 7.25 చౌర్యపాఠం - 2.20 అంటిల్‌డాన్(ఇంగ్లిష్)-5.00, 10.20
- స్క్రీన్ -4 అంటిల్‌డాన్-10.40
- అర్జున్ సన్నాఫ్ వైజయంతి-1.00,7.20
- తుడరుమ్-4.00 -జింఖానా-10.20

లలితామహల్ సారంగపాణి జాతకం

దేవి జింఖానా -11.00 2.00

అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి - 6.00 10.00

నటరాజ్ సూర్యాపేట్ జంక్షన్ (హిందీ)

విజయ్ ఓదెల

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,500	వెండి(కిలో)	1,02,000
22 క్యారెట్స్	90,925		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	40	80
బెండకాయ	35	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	80	దోసకాయ	12	24
దొండకాయ	25	50	ఆలుగడ్డ	25	50
చిక్కుడుకాయ	80	120	గోబిగడ్డ	12	24
కాకరకాయ	35	60	గోబిపువ్వు	35	60
వంకాయ	20	40	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	60	100
మెంతికూర	70	100	చామగడ్డ	60	80
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80	మామిడికాయ	20	40

–సుభాష్‌నగర్



నిజామాబాద్‌రూరల్: నగరంలోని గాయత్రీనగర్‌లో ఉన్న సిద్ధివినాయక స్వామి ఆలయంలో అందెల రవళి నాట్యాలయం వారు సోమవారం రాత్రి నిర్వహించిన నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. మచ్చ చంటయ్య, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల సేవతోనే ఆస్పత్రికి మంచిపేరు



నిజామాబాద్‌నాగారం: జీజీహెచ్‌లో నిర్వహించే కార్మికుల సేవతోనే ఆస్పత్రికి మంచిపేరు వస్తుందని జీజీహెచ్ సూపరిండెంట్ శ్రీనివాస్ అన్నారు. మేడేను పురస్కరించుకొని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఉత్తమ కార్మికులకు జ్ఞాపికలు అందజేశారు. జీజీహెచ్‌లో విధులు నిర్వహించే సిబ్బంది మేడే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా పనిచేసి ఆస్పత్రిని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ తిరుపతి రావు, ఏడీ రాజశేఖర్, నర్సింగ్ గ్రేడ్-2 సూపరింటెండెంట్ చంద్రకళ, నాయకులు హైమద్‌బేగం, స్వరూప, భారతి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.